ప్రజా సమస్యలకు
పరిష్కారం చూపాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

తెలంగాణచౌక్: గీతానగర్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్

రాజన్న సిరిసిల్ల, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వాణిలో ప్రజల నుంచి 16అర్జీలు స్వీకరించి, మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు క్షేత్ర స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. కాగా, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 78 మంది అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి పూజారి, డీపీవో రవీందర్, డీఆర్‌డీఏ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

తెలంగాణ చౌక్, జనవరి 22: టెక్నాలజీని అందిపుచ్చుకొని విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ గౌతమితో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. బ్లాక్ బోర్డుల సాయంతో తరగతులు బోధించే తీరుకంటే ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ) సాయంతో డిజిటల్ రూపంలో తరగతుల బోధన సులభంగా ఉంటుందన్నారు. పాఠశాలలో ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా బోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ చాంప్స్ అమలుతీరుపై ఆరా తీశారు. రాబోయే పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం రోజువారీ అభ్యసన అవసరమని సూచించారు. ఇక్కడ డీఈవో రమేశ్‌కుమార్, హెచ్ఎం శారద, ఉపాధ్యాయుడు భూపాల్‌రెడ్డి ఉన్నారు.

'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం

- ఎస్పీ అఖిల్‌మహాజన్
- 13 ఫిర్యాదుల స్వీకరణ

పోలీస్ కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, జనవరి 22: బాధితుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు 13 ఫిర్యాదులు స్వీకరించారు. వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. ఇక్కడ ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వేములవాడ టౌన్: కల్యాణమహోత్సవంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, నాయకులు

చందుర్తి: మార్కండేయ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌పై వేడుకలను వీక్షిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జైబోలో శ్రీరామ్‌కీ..

- రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠతో వెల్లివిరిసిన భక్తిభావం
- రామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భజనలతో గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు
- వేడుకలను భారీ స్క్రీన్‌లపై తిలకించిన భక్తులు

ముస్తాబాద్: మండల కేంద్రంలో భజనలతో ర్యాలీ తీస్తున్న ఎంపీపీ జనగామ శరత్‌రావు, భక్తులు

వేములవాడటౌన్/ వేములవాడ రూరల్/ కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ గంభీరావుపేట/ ముస్తాబాద్/చందుర్తి/ఇల్లతకుంట, జనవరి 22: జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, శివనగర్‌లోని శివాలయం, విశ్వనాథ ఆలయం, భక్తాంజనేయ, అంబభవాని, సీతా రామాంజనేయ, రామాలయం, వాసవీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ అనుబంధ దేవాలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లి శ్రీ సీతారామస్వామి ఆలయం, వట్టిమల్లలోని శ్రీ సీతా రామస్వామి, నాగారంలోని కోదండరామ స్వామి ఆలయాలు రామనామస్మరణతో మార్మోగాయి. ఎల్లారెడ్డిపేటలోని సత్సంగ సదనంలో వేదపండితులు రామనామం గొప్పదనాన్ని వివరించారు. వేములవాడ, వేములవాడ రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో శ్రీరామ నామ భజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే మండప హనుమాన్ ఆలయ ఆవరణలో రాములోరి కల్యాణమహోత్సవం నిర్వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నేతలు, కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రుద్రంగిలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన వేడుకలకు విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, హాజరయ్యారు. అనంతరం భక్తులు భజన కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్తాబాద్ మండలంలోని ప్రతి గ్రామంలో భజనలతో ర్యాలీలు తీసి, ఇండ్లల్లో దీపాలు వెలిగించారు. భక్తులు టీవీల ముందు చేరి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించి, సాయంత్రం ఉత్సవవిగ్రహాల నుగరుడ సేవపై పురవీధుల గుండా ఊరేగించారు. గోవిందనామస్మరణతో రామాలయం మార్మోగింది. ఆలయ ఆవరణలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చందుర్తిలో ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లో వేడుకలను వీక్షించారు. ఇల్లంతకుంట మండలం పొత్తూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పూజలు చేశారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేయగా, వైశ్య సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో లడ్డూలు పంపిణీ చేశారు.

ఇల్లంతకుంట: పొత్తూరులో ర్యాలీగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

> అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఊరూరా ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. శోభాయాత్రలు, భజనలతో సర్వత్రా భక్తిభావం వెల్లివిరిసింది. జై శ్రీరామ్ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం ఐదు గంటల నుంచే ప్రత్యేక పూజలు, యజ్ఞయాగాదులు, భజనలు చేయగా, ఆలయాలన్నీ కిటకిటలాడాయి. 500ఏండ్ల కల నెరవేరడంతో రామభక్తులు సంబురపడ్డారు. వాడవాడలా అన్నప్రసాదాలు వితరణ చేశారు. వేములవాడ రాజన్న ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ ఇండ్లల్లో దీపాలు వెలిగించి, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తలపై చల్లుకొని వేడుకలను సంబురంగా జరుపుకొన్నారు. పలు గ్రామాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేయగా, బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకలను ప్రజలు తిలకించారు.
> – రాజన్న సిరిసిల్ల, జనవరి 22 (నమస్తే తెలంగాణ)

నేడు చిత్రలేఖనం పోటీలు

తెలంగాణ చౌక్, జనవరి 22: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కే పీ సింగ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా వంద మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్

వేములవాడ రూరల్, జనవరి 22: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి చెకుముకి పోటీలు దోహదం చేస్తాయని హెచ్ఎం శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. ఇక్కడ జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి నడపట్ల కిషన్, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు వేణుమాధవ్, వెంకటేశం ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ..

కోనరావుపేట, జనవరి 22: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను ప్రిన్సిపాల్ కంకణాల సాగర్ నిర్వహించారు. ఇక్కడ ఉపాధ్యాయులు సతీశ్, రవీందర్, శ్రీనివాస్, ప్రమోదిని, తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: ఆదర్శ పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ సాగర్

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సిరిసిల్ల చేనేత కళ విశ్వవ్యాప్తం

- అయోధ్య రామయ్యకు సిరిసిల్ల కానుక
- హరిప్రసాద్ కళారూపం అద్భుతం
- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అభినందన

చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల టౌన్, జనవరి 22: చేనేత కళాకారుడు హరిప్రసాద్ తయారు చేసిన చీరను అయోధ్య రామయ్యకు బహూకరించనున్న నేపథ్యంలో సిరిసిల్ల చేనేత కళ విశ్వవ్యాప్తమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అభివర్ణించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం హరిప్రసాద్‌ను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ హరిప్రసాద్ 20రోజులు శ్రమించి మరమగ్గంపై 8గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండితో రామాయణంలోని పది ఘట్టాలను ఆవిష్కరిస్తూ రూపొందించిన చీరను అయోధ్య రాముడికి సమర్పించడం గర్వంగా ఉందన్నారు. అనంతరం హరిప్రసాద్ దంపతులకు కొత్త బట్టలు పెట్టి, ₹11వేలు కానుకగా అందించారు. మున్సిపల్ కమిషనర్ అయాజ్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

రాజన్న భక్తులకు పాల పంపిణీ

వేములవాడ టౌన్, జనవరి 22: రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు డీఎస్పీ నాగేంద్రాచారి ఆధ్వర్యంలో ప్రతి ఆది, సోమవారాల్లో ఉచితంగా వేడి పాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం క్యూలో ఉన్న భక్తులకు పాలు అందిస్తున్న సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పట్టణ సీఐ కరుణాకర్, ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు శ్రీరాములు, సిబ్బంది ఉన్నారు.

రాజన్న భక్తులకు పాలు అందిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి

రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి

విజేతలను ప్రకటిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

తెలంగాణ చౌక్, జనవరి 22: రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలు ఈ నెల 23, 24తేదీల్లో నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని డీఈవో రమేశ్‌కుమార్ ఆకాంక్షించారు. ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా వ్యాప్తంగా 100ప్రాజెక్టులు రాగా, అందులో 12ఎగ్జిబిట్లను రాష్ట్రస్థాయికి సోమవారం ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కాగా సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే ప్రధాన అంశంగా నిర్వహించిన పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ డీఎస్‌వో దేవయ్య, తదితరులు ఉన్నారు.

యువ కవికి సన్మానం

ఎల్లారెడ్డిపేట, జనవరి 22: బాకుర్‌పల్లికి చెందిన యువకవి కట్ల శ్రీనివాస్ హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నిర్వహించిన త్యాగరాయ గాన సభ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కవితా పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయనను సంస్థ ప్రతినిధులు సత్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

చందుర్తి, జనవరి 22: క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని రామారావుపల్లెలో మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించగా, సోమవారం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హనుమాన్ ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ సర్పంచ్ ఐల్నేని కమలాకర్‌రావు, మాజీ సర్పంచ్ రవీందర్, నల్ల మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గోజ్జిగారి సంజీవ్ ఉన్నారు.

విజేతలకు బహుమతులు అందజేసున్న వికాస్‌రావు

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి

ఆస్తి పన్ను చెల్లించిన వారికి రసీదు అందజేస్తున్న కమిషనర్ అన్వేష్, సిబ్బంది

వేములవాడ, జనవరి 22: పట్టణ ప్రజలందరూ సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని కమిషనర్ అన్వేశ్ కోరారు. సోమవారం ఆయన మున్సిపల్ ఉద్యోగులతో కలిసి ఆస్తి పన్నుల వసూలు కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ప్రజలందరూ ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. పెండింగ్ వాటి పై కూడా ప్రత్యేక దృష్టిసారించామన్నారు. బృందాలుగా ఏర్పడి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట మేనేజర్ సంపత్‌రెడ్డి, ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

చర్లపల్లి జైలుకు అంతర్ జిల్లా నేరస్తుడు

ఎల్లారెడ్డిపేట, జనవరి 22 : పలు మోసాలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చి ఓ నేరస్తుడు తిరిగి మోసాలకు పాల్పడినందుకు పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు తరలించినట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సీఐ అందించిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన కటుకొజ్వుల రమేశ్‌చారి గతంలో పలు జిల్లాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసినందుకు ఎనిమిది కేసులు నమోదయ్యాయి. దీంతో కరీంనగర్ కమిషనరేట్‌లో పీడీ యాక్టు నమోదు కాగా ఏడాది పాటు జైలు శిక్షను అనుభవించాడు. జైలు నుంచి విడుదలై సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట సర్కిల్ స్టేషన్ పరిధిలో తిరిగి తక్కువ ధరకు బంగారు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను సప్లయ్ చేస్తానని కోట్ల రూపాయలు మోసం చేయగా 12 కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు సీఐ శశిధర్‌రెడ్డి రమేశ్ చారికి నిర్బంధ ఉత్తర్వులు అందించి చర్లపల్లి జైలుకు తరలించారు.

విద్యార్థికి సన్మానం

తెలంగాణ చౌక్, జనవరి 22: నేతన్నకు ఎంతో ఉపయోగపడే క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌ను రూపొందించిన విద్యార్థిని జక్కని హేమంత్‌ను కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, వేముల రవి సోమవారం సన్మానించారు. సిరిసిల్లలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి హేమంత్ (తొమ్మిదో తరగతి) నేతన్న కష్టాలను చూసి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉండే ఎగ్జిబిట్‌ను రూపొందించారు. కాగా, హేమంత్‌ను నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఇక్కడ హెచ్ఎం మోతీలాల్, టీచర్లు పురుషోత్తం, పాకాల శంకర్‌గౌడ్, శ్రీహరి, సరిత, రజిత, తదితరులు ఉన్నారు.

విద్యార్థి హేమంత్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు శ్రీనివాస్, వేముల రవి

ఒక్కగానొక్క కొడుకు బలవన్మరణం..

- బోరున విలపించిన తల్లిదండ్రులు
- చందుర్తి మండలం జోగాపూర్‌లో ఘటన

అజయ్ (ఫైల్)

చందుర్తి, జనవరి 22: ఒక్కగానొక్కకొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించిన ఘటన జోగాపూర్‌లో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. జోగాపూర్ గ్రామానికి చెందిన గసికంటి అజయ్(22) గల్ఫ్ వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. గతంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో మెడికల్ టెస్టుకు పాస్‌కాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులందరూ నిద్రించిన తర్వాత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒక్కగానొక్కకొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు మృతదేహంపై పడి రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు 'ఎన్విరాన్మెంటల్' జాతీయ సదస్సు

కరీంనగర్ రూరల్, జనవరి 22: రాష్ట్ర ఉన్నత విద్య మండలి సౌజన్యంతో రసాయన శాస్త్రం సూక్ష్మజీవ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్ మానిటరింగ్ టెక్నిక్స్ పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత తెలిపారు. నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో నేటి నుంచి రెండు రోజుల పాటు (ఈనెల 23,24న) సదస్సు జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194